సాక్షి
జోగులాంబ గద్వాల

గురువారం । 15 । మే । 2025



ప్రాణాలు తీసేస్తున్నారు!
మహబూబ్‌నగర్‌లో హత్యా నేరాలు పెరుగుతుండటం అందరిలో ఆందోళన కలిగిస్తోంది.
వివరాలు 8లో ▸



ముగిసిన బ్రహ్మోత్సవాలు
బీచుపల్లి క్షేత్రంలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.9 /23.9

వాతావరణం
ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.5,586

గద్వాల **వ్యవసాయం:** గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 102 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.5586, కనిష్ఠం రూ.2840, సరాసరి రూ.5256 ధరలు పలికాయి. 20 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్ఠం రూ.5829, కనిష్ఠం రూ.4066, సరాసరి రూ.5679 ధరలు లభించాయి. 357 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్ఠం రూ.1926, కనిష్ఠం రూ.1509, సరాసరి రూ.1759 ధరలు వచ్చాయి. 3 క్వింటాళ్ల కంది రాగా గరిష్ఠం రూ. 6269, కనిష్ఠం రూ. 6259, సరాసరి రూ. 6269 ధరలు పలికాయి.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



గద్వాల: జిల్లాలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మైనార్టీ రెసిడెన్షియల్, కళాశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 2025–26 విద్యాసంవత్సరానికి 5,6,7,8 తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు tgmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్. 7207998985, 73311 70829 నంబర్లను సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన నిషాపార్విన్(989ఎంపీసీ), ముస్కాన్‌బేగం(994బైపీసీ రాష్ట్ర 4వర్యాంకు), జనీరాత బస్సం, అల్పియా, చాంద్‌బీని కలెక్టర్ అభినందించారు. వీరి ఫలితాలు మిగతా విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ పార్వతి పాల్గొన్నారు.

11 రోజుల పాటు విజయయాత్ర

గద్వాల: ఉగ్రవాదులను లక్ష్యంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా 11 రోజుల పాటు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో విజయయాత్ర నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 23వ తేదీ వరకు విజయయాత్ర ర్యాలీలు నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గద్వాల మున్సిపాలిటీలో ఈనెల 17వ తేదీ, అయిజ మున్సిపాలిటీలో ఈనెల 19వ తేదీన, వడ్డేపల్లిలో ఈనెల 20వ తేదీన, ఈనెల 21వ తేదీన అలంపూర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విజయయాత్రలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా తరలివచ్చి విజయయాత్ర ర్యాలీలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, అక్కలరమాదేవి, రవికుమార్, బలిగెర శివారెడ్డి, రజక జయశ్రీ, రజక నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ధర లేక.. దిక్కుతోచక !

ఎండుమిర్చి రైతు కుదేలు



అయిజ శివారులో ఆకుముడుత తెగులు సోకిన మిరప పంట

- తెగుళ్లతో తగ్గిన దిగుబడులు
- పడిపోయిన మార్కెట్ ధరలు
- కోల్డ్ స్టోరేజీల్లో పేరుకుపోయిన ఎండుమిర్చి నిల్వలు

అయిజ: ఆరుగాలం కష్టపడి ఎండు మిరపను పండించిన రైతుకు ఈ ఏడాది కాలం కలిసి రాలేదు. అటు మిర్చి దిగుబడి ఘననీయంగా తగ్గిపోగా.. ఇటు మార్కెట్‌లో ధరలు అమాంతం పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన అధికారులు చేతులెత్తేయడంతో మిర్చి పండించిన రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పురుగులు, తెగుళ్ల కారణంగా గతేడాదితో పోల్చితే ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి తగ్గింది. అదేవిధంగా మార్కెట్‌లో క్వింటాకు ధర రూ.10 వేలు తక్కువ పలుకుతోంది. పండిన పంటను అమ్ముకుందామంటే జిల్లాలో మార్కెట్ లేదు. సుదూర ప్రాంతాల్లో ఉన్న మార్కెట్‌కు పంటను తరలించాలంటే అన్నదాతలు వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తుంది. విధిలేక దళారులకు విక్రయిద్దామంటే మార్కెట్ రేటుకంటే రూ.2 వేల నుంచి రూ.3వేలు తక్కవకు ధరకు అడగడంతోపాటు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు.

అంచనాలు తప్పాయి..

జిల్లాలో 2024లో 65,115 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేయగా.. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మిర్చి రకాలను బట్టి ధర రూ.15 వేల నుంచి రూ. 25వేల వరకు పలికింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు సగం విస్తీర్ణం తగ్గిపోయింది. సాగుబడి తక్కువ విస్తీర్ణం ఉండడంతో ధర ఎక్కువ పలుకుతుందని, లాభాలు ఎక్కువగా ఉంటాయని ఊహించిన రైతుల అంచనాలు తప్పాయి. ధర ఘననీయంగా తగ్గిపోయింది. ఈ ఏడాది వానాకాలంలో 19,785 మంది రైతులు 37,801 ఎకరాల్లో ఎండుమిర్చిని సాగుచేశారు. పంటకు వివిధ రకాల పురుగులు, తెగుళ్ల ఆశించాయి. తామర పురుగు పంటపై పగబట్టింది. ఆకుముడుత ఈ ఏడాది ఎక్కువ శాతం పెంటలను దెబ్బతీసింది. రైతులు ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. అప్పులు మిగిలాయి కానీ పురుగులు మాత్రం చావలేదు. మొత్తంగా ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఎండుమిర్చి రకాలను బట్టి ధర రూ.10 వేల వేల నుంచి రూ.13 వేల వరకు మాత్రమే పలుకుతోంది. మధ్యరకంగా తీసుకుంటే ఎకరానికి రైతులకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రాబడి వస్తోంది. పెట్టుబడి ఎకరానికి సుమారు రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టారు. దీంతో రైతులు ఆరుగాలం పడిన కష్టం వృథా అయ్యింది. పెట్టుబడులు తిరిగి రాకపోగా రైతులు అప్పుల పాలయ్యారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో మిర్చి సాగు ఇలా..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
ఇటిక్యాల	6,022	2,733
మానవపాడు	5,852	2,809
అయిజ	4,991	2,811
ఎర్రవల్లి	4,729	2,281
గద్వాల	4,366	2,397
గట్టు	3,507	2,194
మల్దకల్	2,875	1,734
వడ్డేపల్లి	2,830	2,281
ఉండవెల్లి	2,830	1,344
రాజోళి	1,016	666
అలంపూర్	671	245
ధరూరు	133	94
కేటీదొడ్డి	121	87

తెగుళ్లు ముంచాయి



ఎండుమిర్చికి ఆకుముడుత తెగులు సోకి పంట గిడసబారింది. ఎకరాకు 40 నుంచి 50 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. మిరప పంట నాణ్యత లేనందున ధర కేవలం రూ.10 వేల నుంచి రూ.13 వేలు పలుకుతోంది. పంటను విక్రయిస్తే నష్టమే వస్తోంది.

– జగన్నాథరెడ్డి, మిర్చి రైతు, అయిజ

గిట్టుబాటు ధర కల్పించాలి



మిర్చి పంట విక్రయానికి అధికారులు మార్కెట్ సౌకర్యం, గట్టుబాటు ధర కల్పించాలి. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో పంటను హైదరాబాద్, బెంగుళూరు, గుంటూరుకు తరలిస్తున్నారు. రవాణా ఖర్చు భారమవుతుంది. జిల్లా కేంద్రంలో ప్రతిరోజు ఎండుమిర్చి మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

– గోవిందు, మిర్చి రైతు, అయిజ

దళారులు దోచుకుంటారు



ఎండు మిర్చికి మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో చిన్న రైతుల నుంచి మధ్యదళారులు మార్కెట్ ధర కంటే క్వింటాకు రూ.2 వేలు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. అసలే రూ.లక్షలకు లక్షలు అప్పులు చేసి పెట్టుబడి పెడితే.. పెట్టుబడి రాకపోగా దళారులు నిండా ముంచుతున్నారు.

– దేవేందర్, రైతు, సింధనూరు

పంట మార్పిడి చేయాలి

ఏటా మిరప పంట సాగుచేస్తుండడంతో పురుగులు, తెగుళ్ల ఎక్కువగా ఆశించి దిగుబడులు తగ్గుతున్నాయి. ఏటా పంట మార్పిడి చేయాలి. ఈ ఏడాది మిరప సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. మార్కెట్‌లో ధర కూడా పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. గతేడాది పండించిన మిరపను రైతులు కోల్డ్ స్టోరేజ్ గోదాంలలో నిల్వచేసుకున్నారు. ఈ ఏడాది వచ్చిన పంటను నిల్వ చేసుకునేందుకు గోదాంలు చాలడం లేదు. రైతులు హార్టికల్చర్ అధికారుల సూచన మేరకు సాగుచేస్తే నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

– మహ్మద్ అలీ అక్బర్, హార్టీకల్చర్ జిల్లా అధికారి

మార్కెట్ సౌకర్యం లేక ఇక్కట్లు

పండించిన మిరప పంటకు అధికారులు మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడంతో రైతులు హైదరాబాద్, బెంగళూరు, గుంటూరు ప్రాంతాలకు మిర్చిని తరలించాల్సి వస్తుంది. దీనికోసం ట్రాన్స్‌పోర్ట్ చార్జ్ తడిసి మోపడవుతుంది. హైదరాబాద్‌కు తరలించేందుకు క్వింటాకు రూ.250, బెంగళూరుకు తరలించాలంటే క్వింటాకు సుమారు రూ.1000 ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలి



అల్వలపాడులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తుండగా పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

ధరూరు: కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎక్కడా నిల్వ ఉంచుకోవద్దని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అల్వలపాడులోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు, రైస్ మిల్లులకు ఎంత తరలించారు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా డిజిటల్ తేమ మిషన్ ద్వారా తేమ శాతాన్ని పరిశీలించి 17 శాతం రాగానే ధాన్యాన్ని కాంటా వేసి సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. ముఖ్యంగా గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని సివిల్ సప్లయ్ డీఎంను ఆదేశించారు. ధాన్యం రవాణాకు ఎక్కువ సంఖ్యలో లారీలను సిద్ధం చేసి ఉంచాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటవెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని, ఆ తర్వాత రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చూడాలన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, కాంటా వేసే విషయంలో పారదర్శకంగా తూకాలు వేయాలని, ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఖాళీ చేసేలా ఐకేపీ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, సివిల్ సప్లయ్ డీఎం విమల్, తహశీల్దార్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని అనుమతించొద్దు

కేటీదొడ్డి: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరి ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి మండల పరిధిలోని తెలంగాణ – కర్ణాటకకు సంబంధించిన నందిన్నె చెక్‌పోస్టు, రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల రిజిస్టర్లను పరిశీలించారు. వాహనాల వే బిల్లులు ఏ రాష్ట్రానివి అనేది క్షుణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి స్వామి, సివిల్ సప్లయ్ డీఎం విమల, తహసీల్దార్ హరికృష్ణ పాల్గొన్నారు.

నేటినుంచి డిగ్రీ పరీక్షలు

- రెండుసార్లు వాయిదాల తర్వాత ఎట్టకేలకు ప్రారంభం
- 47 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 39,100 మంది విద్యార్థులు



పీయూ ముఖద్వారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పరీక్షలు పలు కారణాలతో రెండుసార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇందులో ఏబీ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల్లో 2, 4, 6 సెమిస్టర్లతోపాటు పలు సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో పరీక్ష నిర్వహణకు అధికారులు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. వేసవి నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర చర్యలు చేపట్టారు. ఇప్పటికే అన్ని కేంద్రాలకు మెటీరియల్ చేరుకుంది.

సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 47 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా ఇందులో 17 ప్రభుత్వ.. 30 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో సెమిస్టర్–2లో 16,073 మంది విద్యార్థులు, సెమిస్ట ర్–6లో 13,787 మంది, సెమిస్టర్–4లో 9,240 మంది విద్యార్థులు కలిపి మొత్తం 39,100 మంది పరీక్ష రాయనున్నారు. 9 రూట్లలో ఫ్లయింగ్ స్క్వాడ్, 47 మంది సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించారు. మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం..



పాలమూరు యూనివర్సిటీ పరిధిలో గురువారం నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ కూడా కాపీయింగ్ తావు లేకుండా పకడ్బందీగా, పాదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. – శ్రీనివాస్, పీయూ వైస్ చాన్స్‌లర్

సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాళేశ్వరం త్రివేణి సంగమంలో ఈ నెల 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతి పుష్కరాలకు డీలక్స్, సూపర్ లగ్జరీ నడపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 25 వరకు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతామన్నారు. ఆసక్తిగల వారు బస్సులను బుక్ చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాల కోసం అచ్చంపేట 75697 59957, గద్వాల 94405 87650, కల్వకుర్తి 83091 06357, కొల్లాపూర్ 73828 24605, కోస్గి 94415 92651, మహబూబ్‌నగర్ 73828 26982, నాగర్‌కర్నూల్ 73828 27660, నారాయణపేట 73828 26109, షాద్‌నగర్ 97017 84215, వనపర్తి 73828 27527 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పిల్లలమర్రి ‘ముస్తాబు’

రేపు ప్రపంచ సుందరీమణుల రాక

- 750 ఏళ్ల చరిత్ర కలిగిన పిల్లల మర్రి సందర్శన
- మహావృక్షం ఖ్యాతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఏర్పాట్లు
- విజయనగరం కాలం నాటి ఆలయం.. పురావస్తు మ్యూజియానికి సొబగులు
- తెలంగాణతోపాటు జిల్లా సంస్కృతి ప్రతిబింబించేలా అధికారుల సన్నాహాలు
- వెదురు ఆకృతులు, చేనేత చీరలు, మగ్గాలు, బతుకమ్మలు, బోనాల ప్రదర్శన
- గిరిజనుల సంప్రదాయ నృత్యాలతో ఆహ్వానం.. గురుకులాల విద్యార్థులతో మాటాముచ్చట
- సుమారు వెయ్యి మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఈ నెల 16న ప్రపంచ సుందరీమణుల రాక నేపథ్యంలో పాలమూరు ముస్తాబవుతోంది. సుమారు 750 ఏళ్ల చరిత్ర కలిగిన పిల్లల మర్రిని వారు సందర్శించనుండగా.. మహావృక్షం ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ముందుకు సాగుతోంది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపట్టింది.

ఆలయం.. మ్యూజియం.. ఆ తర్వాత పిల్లల మర్రి..

మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో పాలమూరుకు చేరుకోనున్నారు. పిల్లలమర్రి వద్ద తెలంగాణ పండుగల విశిష్టత, సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మలు, బోనాలు, గిరిజనుల సంప్రదాయ నృత్యాల మధ్య వారికి ఆహ్వానం పలికేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా వారు విజయనగర కాలం నాటి పునర్నిర్మించిన రాజరాజేశ్వర ఆలయాన్ని సందర్శించి.. పురావస్తు మ్యూజియానికి రానున్నారు. ఆ తర్వాత లంబాడాల నృత్య ప్రదర్శన మధ్య పిల్లల మర్రికి చేరుకోనున్నారు. మహా వృక్ష విశిష్టత, దీనికి సంబంధించిన చరిత్ర, పునరుజ్జీవం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రపంచ సుందరీమణులకు వివరించనున్నారు. అదేవిధంగా రాజరాజేశ్వర ఆలయ విశిష్టతతోపాటు పురావస్తుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యూజియం విశేషాలను వారికి అర్థమయ్యే రీతిలో వివరించేందుకు ప్రత్యేక గైడ్‌లను నియమించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డాగ్‌స్క్వాడ్ బృందం



పిల్లలమర్రిలో సుందరీకరణ పనులు చేస్తున్న సిబ్బంది

గ్రూప్–2లోని 22 మంది అందగత్తెలు..

మిస్ వరల్డ్–25 పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో వందకు పైగా దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయంగా చాటిచెప్పేందుకు ఈ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం వేదికగా మలుచుకుంది. ఇందులో భాగంగా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లను గ్రూప్–1, గ్రూప్–2గా విభజించి.. ప్రత్యేక థీమ్, టూరిస్ట్ సర్క్యూట్ల వారీగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలను సందర్శించేలా ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు పాలమూరులో ప్రఖ్యాతిగాంచిన పిల్లల మర్రిని గ్రూప్–2లోని వివిధ దేశాలకు చెందిన 22 మంది అందగత్తెలు శుక్రవారం సందర్శించనున్నారు.

దాదాపు 2 గంటలు.. మూడంచెల బందోబస్తు

మిస్ వరల్డ్–25 కంటెస్టెంట్లకు చెందిన గ్రూప్–2 సభ్యులు 16న సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేక బస్సులో రోడ్డు మార్గాన మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి వద్దకు నేరుగా చేరుకుంటారు. పలు కార్యక్రమాల అనంతరం తిరిగి రాత్రి ఏడు గంటలకు రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరనున్నట్లు తెలిసింది. ప్రపంచ సుందరీమణుల రాక నేపథ్యంలో ఐజీ, ఎస్పీ పర్యవేక్షణలో పోలీసులు మూడంచెల బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డాగ్, బాంబ్ స్క్వాడ్లతో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. సుమారు వెయ్యి మంది పోలీస్ సిబ్బందికి బందోబస్తు విధులు కేటాయించారు.

గద్వాల, నారాయణపేట చేనేత చీరల ప్రదర్శన..

మన నేతన్నల కళా నైపుణ్యాన్ని వివిధ దేశాలకు చెందిన అందమైన భామలకు తెలియజేసేలా పిల్లల మర్రి ఆవరణలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేస్తున్నారు. అందులో ప్రఖ్యాతి గాంచిన గద్వాల, నారాయణపేట చేనేత చీరలను ప్రదర్శించనున్నారు. మగ్గాలతో సహజసిద్ధంగా నేసే చీరల తయారీకి సంబంధించిన విధానాన్ని వివరించనున్నారు. దీంతోపాటు వెదురుతో తయారు చేసిన అలంకరణ ఆకృతులు, మహిళా సంఘాల హస్త కళానైపుణ్యాన్ని వివరించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. పిల్లల మర్రి ఆవరణలో 22 మంది అందాల భామల చేతుల మీదుగా వివిధ రకాల మొక్కలు నాటేలా అధికారులు చర్యలు చేపట్టారు. చివరగా గురుకుల విద్యార్థులతో మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు కాసేపు ముచ్చటించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

ఏర్పాట్లు ఇలా..

మిస్ వరల్డ్–25 కంటెస్టెంట్లు పిల్లల మర్రి పర్యటనను పురస్కరించుకుని పురావస్తు, అటవీ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో వివిధ రకాల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఊడల మర్రి చుట్టూ మట్టిని చదును చేసి, గ్రాస్ మ్యాట్లు ఏర్పాటు చేస్తున్నారు. మహావృక్షం చుట్టూ గోడ, ఊడల మర్రి పునరుజ్జీవంలో భాగంగా ఏర్పాటు చేసిన సిమెంట్ పిల్లరతోపాటు సిమెంట్ కుర్చీలకు రంగులు అద్దుతున్నారు. పిల్లలమర్రి చుట్టూ పచ్చదనం ఉట్టిపడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాటర్ ప్రూఫ్ టెంట్లతోపాటు ప్రత్యేకంగా వాష్‌రూంలను సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా మ్యూజియంలోని శిల్పాలను శుభ్రం చేయడంతోపాటు వాటికి నేమ్ బోర్డులు రాయిస్తున్నారు. ఆయా శిల్పాలు ఏ కాలానికి చెందినవి.. ఎవరి హయాంలో తయారు చేశారు.. ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.. వంటి వివరాలు నేమ్ బోర్డులో పొందుపరుస్తున్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో సౌండ్ అండ్ లైటింగ్, పారిశుద్ధ్య పనులు చకచకా సాగుతున్నాయి.

క్లుప్తంగా

ట్రాక్టర్‌ కిందపడి రైతు దుర్మరణం


బాలస్వామి (ఫైల్‌)

తిమ్మాజిపేట: ట్రాక్టర్‌ కొనుగోలు చేసి పది రోజులు కూడా కాకముందే అంతలోనే అనంత లోకాలకు వెళ్లాడు రైతు. ట్రాక్టర్‌ నడుపుతూ ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్‌ కిందపడి రైతు మృతి చెందిన సంఘటన తిమ్మాజిపేట మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీనివాస్‌ కథనం ప్రకారం.. మండలంలోని బావాజిపల్లికి చెందిన బత్తుల బాలస్వామి(48) వ్యవసాయ పనుల కోసం ఇటీవల నూతనంగా ట్రాక్టర్‌ కొనుగోలు చేశాడు. తన సొంత వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో పొలం దున్నేందుకు వెళ్లాడు. పొలం దున్నుతున్న క్రమంలో ట్రాక్టర్‌ పొలం ఒడ్డు ఎక్కి అదుపు తప్పి బాలస్వామిపై బోల్తాపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దగ్గర పొలంలో ఉన్న రైతు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని జేసీబీతో ట్రాక్టర్‌ను తొలగించగా అప్పటికే మృతి చెందాడు. హుటాహుటిన మృతదేహాన్ని నాగర్‌కర్నూల్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతనికి భార్య రేవతమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవల కుమార్తె వివాహం చేశాడు. బాలస్వామి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నాగర్‌కర్నూల్‌ క్రైం: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కుమ్మెర శివారులో చోటు చేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లి మండలంలోని వసంతాపూర్‌ గ్రామానికి చెందిన రాములమ్మ (44) భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందడంతో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో ఆమె అనుమానాస్పద స్థితిలో కుమ్మెర శివారులోని కేఎల్‌ఐ కాల్వ వద్ద మృతి చెంది ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనరల్‌ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రాములమ్మ మృతి చెంది రెండు రోజులై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉండటం, శరీరంపై బట్టలు సరిగా లేకపోవడంతో ఎవరైనా హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు సంబంధించి మృతురాలి అన్న చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

బావిలో మృతదేహం లభ్యం


శ్రీనివాసులు (ఫైల్‌)

బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన అయ్యగారి బావిలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు (56) మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు శ్రీనివాసులు కోసం తీవ్రంగా గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా బుధవారం ఉదయం అయ్యగారి బావి సమీప రైతులు బావిలోని మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బావి నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

పాన్‌గల్‌: మండల కేంద్రం పాన్‌గల్‌లో డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ఎస్‌ఐ హిమాబిందు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్‌కు చెందిన వడ్డె శివయ్య(51) కుటుంబం హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 7న భార్యతో కలిసి స్వగ్రామం పాన్‌గల్‌కు వచ్చారు. అయితే ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లినా శివయ్య కనిపించకుండా పోయాడు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలోని వైన్‌ షాపు సమీపంలో ఉన్న డ్రెయినేజీలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. శివయ్య మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని చిన్న ఆముదాలపాడు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌ రెడ్డి(65) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్య గమనించి అంబులెన్స్‌లో కర్నూల్‌ ఆసుపత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య హైమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌ తెలిపారు.

ప్రాణాలు తీసేస్తున్నారు!



జీవితాంతం తోడుంటానని అగ్ని సాక్షిగా పెళ్లాడిన అర్ధాంగిని అర్ధాంతరంగా మట్టుబెడుతున్నారు.. పొత్తి కడుపులో దాచుకొని పెంచి పెద్ద చేసిన కన్న తల్లి దండ్రులను చిన్నచిన్న కారణాలతో కడతేరుస్తున్నారు.. ఒకే గర్భం పంచుకొని పుట్టిన అన్నదమ్ముళ్లు స్వల్ప తగాదాలతో శత్రువులుగా మారి రక్తం పారించుకుంటున్నారు.. ఆస్తి పంచలేదని.. అవసరాలకు డబ్బు ఇవ్వలేదని కన్న తండ్రిని తుదముట్టిస్తున్నారు.. వివాహేతర బంధం మోజులో కట్టుకున్న భర్తను అడ్డు తొలగించుకుంటున్నారు భార్యలు. ఇలాంటి దారుణ ఘటనలు ఇటీవల జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. వాటిని చూస్తే.. కవి అందెశ్రీ అన్నట్టు మచ్చుకైనా కానరాడు.. మానవత్వం ఉన్నవాడు అన్న మాటలు నిజమేననిపిస్తున్నాయి.! జిల్లాలో వరుస హత్యానేరం ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

– మహబూబ్‌నగర్‌ క్రైం

- క్షణికావేశంతోనే దారుణాలు
- చిన్నచిన్న విషయాలకే హత్యల వరకు వెళ్తున్న వైనం
- జిల్లాలో పెరుగుతున్న హత్యానేరాలు
- 13 రోజుల వ్యవధిలో ఆరుగురి హత్య

మూడేళ్లలో హత్యల సంఖ్య ఇలా..

2023	2024	2025
26	30	14


దొడ్డలోనిపల్లిలో జరిగిన హత్య ఘటనను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్‌)

భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆస్తుల పంపకం, లావాదేవీల్లో తేడాలపై కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించే వీలున్నవే. కానీ ఆ దిశగా చేస్తున్న వారు తక్కువవుతున్నారు. వివాదాలు పరిష్కరించేందుకు పోలీస్‌ స్టేషన్లు, న్యాయస్థానాలు ఉన్నా వాటిని పట్టించుకోవడం లేదు. ప్రతిసారి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటూ ఘర్షణలకు దిగుతున్నారు. ఈ క్రమంలో ప్రాణాలు తీస్తున్నారు. హత్యలకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయనే అవగాహన ఉన్నా.. వారిలో భయం కనిపించడం లేదు. తమ మాట నెగ్గాలనే మొండితనంతో వ్యవహరిస్తున్నారు.

పోలీసుల నిర్లక్ష్యం..

భూ వివాదాలు, అదనపు కట్నం, ప్రేమ వివాహాల విషయం చాలా వరకు ముందే గ్రామ పోలీస్‌ అధికారులు, ఫిర్యాదుల రూపంలో పోలీసులకు తెలుస్తూనే ఉన్నాయి. అయితే అవి చిన్న విషయాలుగా భావిస్తూ పోలీసులు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారు. బాధితులు, రక్షణ లేదనుకునే వారు పోలీసులను ఆశ్రయించినప్పుడు మీరే పరిష్కరించుకోవాలని సూచిస్తూ వదిలేస్తున్నారు. బెదిరింపులకు గురి చేస్తున్న వారిని ఠాణాకు పిలిపించి హెచ్చరించడం.. వారి కదలికలపై నిఘా వేసి ఉంచితే పరిస్థితి చెయ్యి దాటేది కాదు. అలాగే గతంలో కేసులు నమోదైన వారు, రౌడీ షీటర్లపై నిఘా ఉంచినట్లే గ్రామాల్లో విచ్చలవిడిగా వ్యవహరించే వారు, ఆరోపణలున్న వ్యక్తులపైనా దృష్టిపెడితే ఈ హత్యకాండకు అడ్డుకట్ట వేసే వీలుంటుంది.

ఉక్కుపాదం మోపితేనే..

హత్యలకే పాల్పడిన తర్వాత హంతకులు చెలరేగిపోతున్నారు. బాధిత కుటుంబ సభ్యులను బెదిరించి రాజీ చేసుకుంటున్నారు. స్థానికంగా ఉండే పైరవీకారులు జోక్యం చేసుకుంటూ.. వ్యక్తి ఎలాగూ పోయాడు.. వారు ఇచ్చేది తీసుకొని రాజీ చేసుకొండి.. లేకుంటే మీకే ప్రమాదం అంటూ బాధిత కుటుంబాలను రాజీకి ఒప్పిస్తున్నారు. పోలీసులు బాధిత కుటుంబాలకు అండగా నిలిచి నిందితులకు శిక్షలు పడేలా చేస్తే రాజీలకు తావుండదు.


కావేరమ్మపేటలో హత్యకు గురైన గుర్తుతెలియని వ్యక్తి (ఫైల్‌

మద్యం మత్తులో ఎక్కువగా..



హత్యలు చేసే వారి మానసిక స్థితి విభిన్నంగా ఉంటుంది. మద్యం మత్తులో ఎక్కువగా నేరాలకు పాల్పడుతుంటారు. ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవడం వల్ల మెదడులో కొన్ని రసాయనాలు పనిచేస్తాయి. ఈ సమయంలో వారు ఎవరి మాటను లెక్కచేయరు. తాము చేయాలనుకున్న పనిపైనే దృష్టి పెడుతారు. ఇలాంటి సమయంలోనే హత్యలు చేస్తున్నారు. ఇదే కారణంతో ఆత్మహత్యలు కూడా చేసుకుంటారు. సున్నిత మనసు కలిగిన వారు తమను తాము ఆత్మహత్య చేసుకుంటారు. మిగిలిన వారు అవతలి వ్యక్తులను చంపి ప్రతీకారం తీర్చుకోవడం చేస్తుంటారు. వీరికి సరైన తరహాలో కౌన్సెలింగ్‌ ఇవ్వడం, ఆలోచన తీరు మార్చడం అవసరం.

– డా.అనిల్‌రాజ్, అసిస్టెంట్‌ ప్రొఫెసర్, సైకియాట్రిస్ట్‌

క్షణికావేశంలోనే..



జిల్లాలో జరిగిన హత్యలు పథకం ప్రకారం జరిగినవి కాదు. కేవలం క్షణికావేశంలో చేయడం జరిగింది. కావేరమ్మపేటలో జరిగిన హత్యకు సంబంధించి ఇంకా నేరస్తులు ఎవరూ అనేది తెలియరాలేదు. వివాహేతర సంబంధాల నేపథ్యంలో హత్యలు పెరుగుతున్నాయి. పోలీస్‌ శాఖ నుంచి అవసరమైన కౌన్సెలింగ్‌ కార్యక్రమాలు చేపడుతాం. క్షణికావేశంలో తప్పులు చేయరాదు. చిన్న పొరపాటుకు జీవితకాలం నష్టపోవాల్సి ఉంటుంది.

–వెంకటేశ్వర్లు, డీఎస్పీ

ఇవీ కారణాలు..

- భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన లేకపోవడం.. పట్టుదల, పంతాలకు వెళ్లడం.
- ఒకరిపై మరొకరు విశ్వాసం కోల్పోవడం. అనుమానం పెనుభూతంగా మారడం.
- పరువు ప్రతిష్టలకు భంగం కలిగిందని భావించడం, మద్యానికి బానిస కావడం, కుటుంబాన్ని పూర్తిగా పట్టించుకోక పోవడం, వివాహేతర సంబంధాలు పెట్టుకోవడం.
- ఆర్థిక సమస్యలు, అదనపు వరకట్నం, మానసిక స్థితి పట్టుతప్పి విచక్షణ కోల్పోవడం, ధనాపేక్ష స్వేచ్ఛను కోరుకోవడం, క్షణికావేశంలో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం.

ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు..

- మహబూబ్‌నగర్‌ అర్బన్‌ మండలం దొడ్డలోనిపల్లికి చెందిన శాంతమ్మ (35)కు నవాబ్‌పేట మండలం తీగలపల్లికి చెందిన కృష్ణయ్యతో ఐదేళ్ల నుంచి వివాహేతర సంబంధం కొనసాగుతుంది. కొన్ని రోజుల నుంచి ఇద్దరి మధ్య డబ్బులు వ్యవహారంలో గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఈ నెల 7న మరోసారి డబ్బులు విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో శాంతమ్మను గొంతు నులిమి హత్యచేశాడు.
- నవాబ్‌పేట మండలం కొల్లూర్‌కు చెందిన శ్రీరామ్‌ నరేష్‌ తను సహజీవనం చేస్తున్న శ్రీదేవి అనే మహిళను ఈ నెల 1న అత్యంత దారుణంగా చున్నీతో ఉరివేసి, ఆ తర్వాత కత్తితో పొడిచి హత్యచేశాడు.
- మూసాపేట మండలం జానంపేటకు చెందిన రాజేష్, మహబూబ్‌నగర్‌ మండలం బొక్కలోనిపల్లికి చెందిన సరిత (30)కు కొన్నేళ్ల క్రితం వివాహం కాగా.. భార్య స్వగ్రామమైన బొక్కలోనిపల్లిలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకునే వారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొంతకాలంగా సరిత ప్రవర్తన తీరుపై అనుమానం పెంచుకున్న భర్త రాజేష్.. ఈ నెల 8న గొడలితో భార్యపై విచక్షణరహితంగా దాడిచేసి హతమార్చాడు.
- ఈ నెల 3న భూత్పూర్‌ మండలం ఎల్కిచర్ల గ్రామానికి చెందిన కుర్వగొల్ల నాగమ్మ (40)ను అదే గ్రామానికి చెందిన కట్టె పర్వతాలు గొంతు కోసి హత్య చేశాడు. మృతురాలు నాగమ్మతో అతడికి కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఈ క్రమంలో పర్వతాలు కూతురు పెళ్లి కోసం ఆమె వద్ద రూ. 50వేలు అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని కోరడంతో నాగమ్మను పథకం ప్రకారం హత్య చేశాడు.
- నవాబుపేటలో ఈ నెల 12న తన భార్యను నిత్యం ఇబ్బంది పెడుతున్నాడని యాదయ్య అనే వ్యక్తి తన కన్నతండ్రి బుచ్చయ్య (53)ను హతమార్చాడు. ప్రేమ పెళ్లి చేసుకున్న కొడుకు వ్యవహారం తండ్రికి నచ్చకపోవడంతో కొడలిని తరచూ ఇబ్బంది పెడుతున్నాడనే క్షణికావేశంలో తండ్రిని హత్య చేశాడు.
- మార్చి 18న కొరంపేటలో గుర్తుతెలియని వ్యక్తిని అత్యంత దారుణంగా కత్తులతో పొడిచి హత్య చేయగా.. సదరు వ్యక్తి ఎవరూ అనేది ఇప్పటి వరకు గుర్తించలేదు.

అండర్‌ -19, 23 బాలుర క్రికెట్‌ క్రీడాకారుల ఎంపిక

ఉమ్మడి జిల్లా నుంచి 60మంది హాజరు


ఎంపికకు హాజరైన వారితో ముఖ్యులు

జడ్చర్ల టౌన్‌: హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్‌ -19, 23 బాలుర క్రికెట్‌ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జట్టు కోసం బుధవారం స్థానిక సేడియం మైదానంలో ఎంపిక నిర్వహించారు. ఎంపికలకు జడ్చర్ల, షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి 60మంది హాజరయ్యారు. ఎంపిక కార్యక్రమాన్ని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కోనేటి పుష్పలత ప్రారంభించి ప్రసంగించారు. క్రీడాకారులు తమ ప్రతిభను వెలికి తీసి జట్టుకు ఎంపిక కావటంతో పాటు టోర్నీలో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.రవిశంకర్, కల్వారాంరెడ్డి, అశోక్‌యాదవ్, కౌన్సిలర్లు సతీష్, ఉమాశంకర్‌గౌడ్, ఎండీసీఏ పరిశీలకులు మన్నాన్‌నియర్, కోచ్‌లు మోయిన్, మహేష్‌లు పాల్గొన్నారు.


బౌలింగ్‌ చేస్తున్న క్రీడాకారుడు

తాళం వేసిన ఇంటికి కన్నం


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

మహబూబ్‌నగర్‌ క్రైం: తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని దొంగలు రెచ్చిపోయారు. ఇంట్లో ఉన్న బంగారం మొత్తం ఎత్తుకెళ్లారు. టూటౌన్‌ సీఐ ఇజాజుద్దీన్‌ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని న్యూమోతీనగర్‌కు చెందిన మంజుల కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 10న ఇంటికి తాళం వేసి గ్రామంలో జాతర ఉంటే వెళ్లారు. అయితే బుధవారం ఆమె ఇంటి పక్కనే ఉన్న ఓ వ్యక్తి ఆమెకు ఫోన్‌ ద్వారా మీ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం ఇవ్వగా బాధితురాలు మంజుల ఇంటికి వచ్చి చూసుకోగా బీరువాలో ఉన్న 16 తులాల బంగారం, 20 తులాల వెండి వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించారు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఇంట్లో విలువైన వస్తువులు పెట్టరాదని, కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముగిసిన బీచుపల్లి అంజన్న బ్రహ్మోత్సవాలు


పల్లకీలో స్వామిని కృష్ణానదికి తీసుకెళ్తున్న అర్చకులు

- వైభవంగా కృష్ణానదిలో అమృతస్నానం
- ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఇటిక్యాల: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా చివరి రోజు ఉదయం సన్నాయి వాయిద్యాలతో ఆంజనేయస్వామిని ఆలయం నుంచి పల్లకీలో కృష్ణానది వరకు ఊరేగించారు. పవిత్ర కృష్ణానదిలో అర్చకులు వేద మంత్రాలతో బీచుపల్లి రాయుడికి అమృతస్నానం చేయించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలు తిలకించి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి దాసంగాలతో అంజన్నకు మట్టి కుండల్లో నైవేద్యాలు వండి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు, అర్చకులు,ఉన్నారు.


కృష్ణానదిలో ఆంజనేయస్వామికి అమృతస్నానం చేయిస్తున్న అర్చకులు

క్రీడలతో శారీరక దారుఢ్యం


క్రీడాకారులతో కళాశాల డీన్‌ డా. జె.చీన, అధ్యాపకులు, సిబ్బంది


కొత్తకోట రూరల్‌: ప్రస్తుతం మానవాళిని కబళిస్తున్న జీవనశైలి వ్యాధులను దీటుగా తట్టుకోవాలంటే నాణ్యమైన ఆహారంతో పాటు శారీరక దారుఢ్యం ముఖ్యమని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్‌ డా. జె.చీన అన్నారు. పెద్దమందడి మండలం మోజర్ల ఉద్యాన కళాశాల వేదికగా కొండా లక్ష్మణ్‌ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని 4 ఉద్యాన పాలిటెక్నిక్‌ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంగళ, బుధవారం జరిగిన క్రీడాపోటీల్లో కరీంనగర్‌ జిల్లా రామగిరి ఖిల్లా, ఆదిలాబాద్‌లోని దస్నాపూర్, నల్గొండలోని గడ్డిపల్లి, కొల్లాపూర్‌లోని ఉద్యాన పాలిటెక్నిక్‌ కళాశాల జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఆటల పోటీలను తప్పనిసరి భాగంగా చేసుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాసం, బృందాలుగా పనిచేయడం, నాయకత్వ లక్షణాలు, ఆలోచన మార్గాల పెంపొందింపు వంటి జీవన వికాస సూత్రాలన్నీ ఫిజికల్‌ ఫిట్‌నెస్‌తోనే ముడిపడి ఉన్నాయన్నారు. అన్ని ఉద్యాన పాలిటెక్నిక్‌ కళాశాలల్లో చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాతినిధ్యం ఉందని.. ఇందుకుగాను ఫిట్‌నెస్‌ కోచ్‌లు, కావాల్సిన సౌకర్యాలు వర్సిటీ సమకూరుస్తుందని వివరించారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసోసియేట్‌ డీన్‌ డా. పిడిగం సైదయ్య, రామగిరి ఖిల్లా ఉద్యాన పాలిటెక్నిక్‌ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డా. బి.నవీన్‌కుమార్, ఉద్యాన పాలిటెక్నిక్‌ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ నరేష్‌గౌడ్, అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డా. షహనాజ్, పూర్ణిమ మిశ్రా, కో–ఆర్డినేటర్‌ డా. జి.విద్య, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు శ్రీనివాస్, గౌతమి, అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ రాజేశ్వరి, ఫిజికల్‌ డైరెక్టర్‌ మహేష్‌ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతు


గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న రెస్క్యూ టీం

ఇటిక్యాల: ఈతకు వెళ్లి బావిలో వ్యక్తి గల్లంతైన సంఘటన ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల గ్రామంలో బుధవారం చోటుకుంది. ఎస్‌ఐ మురళీ, స్థానికుల కథనం మేరకు.. వనపర్తి జిల్లా కొంకలపల్లి గ్రామానికి చెందిన శేషయ్య(55) దేవర నిమిత్తం కోదండాపురం గ్రామానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో ఐదు మంది స్నేహితులతో కలసి వేముల గ్రామంలోని జక్కం బావిలోకి ఈత బుధవారం ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈతలో పోటీ పడుతుండగా ప్రమాదవశాత్తు శేషయ్య బావిలో గల్లంతైనట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ సిబ్బందితో కలసి రెస్క్యూ టీం సహాయంతో గల్లంతైన వ్యక్తి కోసం బావిలో గాలించినట్లు తెలిపారు. గజ ఈతగాళ్ల సాయంతో దాదాపు ఐదు గంటల నుంచి ప్రయత్నించిన వ్యక్తి ఆచూకీ లభించనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న శేషయ్య కుటుంబ సభ్యులు బావి వద్దకు చేరుకున్నారు. దేవర నిమిత్తం వచ్చి బావిలో వ్యక్తి గల్లంతు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారులో మంటలు


మంటలను ఆర్పుతున్న ఫైర్‌స్టేషన్‌ సిబ్బంది

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌ యార్డు ఎదుట బుధవారం పార్క్‌ చేసిన కారులో ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. చివరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మిడ్జిల్‌ మండలానికి చెందిన ఓ వ్యక్తి పని నిమిత్తం జడ్చర్లకు వచ్చి మార్కెట్‌ యార్డు వద్ద కారును పార్క్‌ చేసి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఆకస్మాత్తుగా కారులో నుంచి పొగలు వచ్చి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మార్కెట్‌ యార్డు అధికారులకు సమాచారం ఇవ్వడంతో రైతులను అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

చికిత్స పొందుతూ మరొకరు మృతి


సాయి (ఫైల్‌)

వెల్దండ: మండలంలోని కొట్ర సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొమ్ముల సాయి(28) వెల్దండలోని యెన్నమ్స్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. కారు రోడ్డుపై ఆపిన డీసీఎంను ఢీకొన్న ప్రమాదంలో ఇనుప చువ్వలు గుచ్చుకొని 8 నెలల చిన్నారి తేజశ్రీ అక్కడికక్కడే మృతిచెందగా.. సాయి, ఆయన భార్య శిరీష తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సాయి మృతిచెందగా ఆయన భార్య శిరీష ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ ఘటనపై సాయి సోదరుడు కొమ్ముల ప్రభాకర్‌ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌ కల్వకోలు బాలస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో సాయి, ఆయన కుమార్తె తేజశ్రీ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో జైలుశిక్ష

నవాబుపేట: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ విక్రమ్‌ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో ఈ నెల 9న పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా.. మూసాపేట మండలం తాళ్లగూడ గ్రామానికి చెందిన పాశం నరేష్‌ మద్యం మత్తులో వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడినట్లు పేర్కొన్నారు. అతడిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా.. జడ్జి శశిధర్‌ రెండు రోజుల జైలుశిక్ష, రూ. 5వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టాటా ఏస్‌ ఢీ.. ఒకరి మృతి, మరొకరికి గాయాలు

వనపర్తి రూరల్‌: బైక్‌ను టాటా ఏస్‌ వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. చిమనగుంటపల్లి శివారులోని సద్గురు భజన మండలి ఎదురుగా బుధవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వనపర్తి రూరల్‌ ఎస్‌ఐ జలెందర్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల్‌ జిల్లా ఉండవెల్లి గ్రామానికి చెందిన మంగళి జమ్మన్న (40) వాయిద్యా కళాకారుడు. గోపాల్‌పేట మండలం చెన్నూర్‌ గ్రామంలో పెళ్లి ఉండడంతో మరో మిత్రుడితో కలిసి భజంత్రి వాయించడానికి బైక్‌పై వెళ్లి బుధవారం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో వనపర్తి మండలం చిమనగుంటపల్లి వద్ద బైక్‌ను టాటా ఏస్‌ వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు జమ్మన్న అప్పటికే మృతి చెందినట్లు తెలుపగా మరో వ్యక్తి వెంకటేశ్వర్లును కర్నూల్‌ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సుభద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలయ్య తెలిపారు.

బాలికపై అత్యాచారం.. పోక్సో కేసు నమోదు

కోస్గి రూరల్‌: బాలికపై అత్యాచారం చేసిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్‌ బుధవారం తెలిపారు. గుండుమాల్‌ మండలంలోని బలుబద్రాయపల్లి గ్రామం ఒడ్డుక్రిందితండాకు చెందిన బాలిక (15) ఈ నెల 9న బహిర్భూమికి వెళ్లగా అదే గ్రామానికి చెందిన సబావత్‌ విజయ్‌కుమార్‌ బాలిక నోట్లో గుడ్డలు కుక్కి పక్కనే ఉన్న గుట్టలోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. ఆపై ఈ విషయం ఎరికైనా చెబితే చంపేస్తానని బాలికను బెదిరించాడు. అటుగా వెళుతున్న కొందరు దీనిని గమనించి బాలిక తల్లికి విషయాన్ని చెప్పారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.